క్లుప్తంగా

నేటి నుంచి పోలమాంబ, పరదేశమ్మ పండగ


బాడంగిలో కొలువైన పోలమాంబ శిలావిగ్రహం

బాడంగి: మండల కేంద్రంలో సోమవారం నుంచి పరదేశమ్మ, పోలమాంబ పండగ నిర్వహించనున్నారు. ఆదివారం ఉయ్యాల కంబాల ఉత్సవంతో ప్రారంభమైన పండగ మూడు రోజుల పాటు జరుపుతారు. సోమవారం తొలేళ్ల సంబరం, మంగళవారం పరదేశమ్మ ఘటం ఊరేగింపు, అనుపోత్సవం చేపడతారు. అదేరోజు రాత్రి నుంచి పోలమాంబ ఘటాల ఊరేగింపు చేపట్టి, మరుసటి రోజు బుధవారం వేకువ జాము వరకు కొనసాగిస్తారు. అనంతరం ఉదయం అంజలి రథోత్సవం, ప్రత్యేక పూజలు, సాయంత్రం అనుపోత్సవం చేస్తారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రామదాసు ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24వ తేదీలోగా ఏపీజీపీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పంటకోత ప్రయోగంతో మంచి ఫలితాలు


ముద్దాడ జోగివలస గ్రామంలో పంటకోత ప్రయోగం చేస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని ముద్దాడ జోగివలస గ్రామంలో రాగి పంటలో పంటకోత ప్రయోగం ఆదివారం నిర్వహించారు. సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటతో పాటు రసాయనిక ఎరువులతో సాగు చేసిన పంటలో ప్రయోగం చేయగా, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పండించిన పంట దిగుబడి అధికంగా వచ్చినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనీ డి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీఒక్క రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని, తద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ పి.రేఖ, ఐసీఆర్‌పీఎస్‌లు నాగమణి, శ్రావణి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీకి నియామకపత్రం


నియామకపత్రం అందుకుంటున్న ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సభ్యులు

బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తగా నియమించిన ఎమ్మార్పీఎస్ మండల కమిటీకి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీను మాదిగ ఆదివారం నియామకపత్రం అందజేశారు. బొబ్బిలి నియోజకవర్గ కన్వీనర్‌గా కింతలివానిపేటకు చెందిన కింతలి రాము ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జి.వరప్రసాద్ మాదిగ, బొద్దాన అప్పారావు మాదిగ, కాగాన సునీల్‌కుమార్ మాదిగ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పాతపుస్తకాలు అందజేత


బాడంగి గ్రంథాలయానికి పాతపుస్తకాలు అందజేస్తున్న సాధన యువజన సంఘం సభ్యులు

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయానికి నెల్లిమర్ల మండలంలోని జరజాపుపేట సాధన యువజన సంఘం సభ్యులు పాతపుస్తకాలను ఆదివారం వితరణ చేశారు. గత కొన్నేళ్లుగా సేకరించిన పుస్తకాలు గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు ఉపయోగపడతాయన్న సదుద్దేశ్యంతో వాటిని లైబ్రేరియన్ దుర్గాప్రసాద్‌కు అందజేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన

రేగిడి: మండలంలోని కోడిశ గ్రామంలో మొక్కజొన్న సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడ్వాంటే కంపెనీ మేనేజర్ ఐ.మణికంఠ మొక్కజొన్న సాగు చేసేటప్పుడు పాటించాల్సిన మెలకువలు తెలిపారు. అడ్వాంటే ఏడీవీ-768 రకాన్ని సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మోక్షం

- రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- రూ.1.92 కోట్లతో అరసబలగ, సోమిదవలసలకు రోడ్లు
- టీడీపీ హయాంలో సరైన రోడ్లు లేకపోవడంతో గ్రామస్తుల ఇక్కట్లు
- ప్రస్తుతం రోడ్ల నిర్మాణం పూర్తి కావడంపై గ్రామస్తుల హర్షం


తెర్లాం: కొత్తగా వేసిన సోమిదవలస తారురోడ్డు


తెర్లాం: అరసబలగ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం

తెర్లాం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ రోడ్లకు మోక్షం లభించింది. చాలా గ్రామాలకు కొత్తగా తారురోడ్లు వేయడంతో పాటు రోడ్లు అధ్వానంగా ఉన్న మరికొన్ని గ్రామాలకు బీటీ రోడ్లు వేయించింది. మండలంలోని అరసబలగ, సోమిదవలస గ్రామాల రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.1.92 కోట్లు మంజూరు చేయగా, ఆ నిధులతో ఆయా గ్రామాలకు తారురోడ్లు నిర్మించారు. అలాగే పణుకువలస పంచాయతీలోని సోమిదవలస గ్రామానికి రాజాం–రామభద్రపురం ఆర్అండ్‌బీ రోడ్డులోని డి.గదబవలస జంక్షన్ నుంచి 1.2 కిలో మీటర్ల మేర అధ్వానంగా ఉన్న రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.95 లక్షల నిధులు మంజూరు చేసి, రోడ్డు నిర్మాణం చేపట్టారు. అలాగే అరసబలగ గ్రామానికి ఉన్న రోడ్డు కూడా దారుణంగా ఉండడంతో రాజాం–రామభద్రపురం ఆర్అండ్‌బీ రోడ్డులో కొత్తపేట నుంచి అరసబలగ వరకు ఉన్న 1.4 కిలోమీటర్ల మేర రూ.97 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు వేశారు. ఎట్టకేలకు రహదారి కష్టాలు తీరడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రామభద్రపురం: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా పరిష్కారం దొరుకుతోంది. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుల దృష్టికి గ్రామస్తులు సమస్యలను తీసుకువెళ్తున్నారు. నేతలు కూడా తక్షణమే స్పందించి, వారి సమస్యలను తీరుస్తున్నారు. ఇప్పటివరకు మండలంలోని 7 సచివాలయాల పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి దాదాపు రూ.1.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా గ్రామాల్లో ఉన్న రోడ్డు కష్టాలు తీరడంతో గ్రామస్తులు ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని మెచ్చుకుంటున్నారు.


రామభద్రపురం: తారాపురంలో రోడ్డు నిర్మాణానికి ముందు నిర్మించిన డ్రైనేజీ


రామభద్రపురం: నరసాపురంలో కల్వర్టు శ్లాబు నిర్మాణ పనుల్లో భవన నిర్మాణ కార్మికులు

ఇబ్బందులు తీరాయి..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై దృష్టిసారిస్తుండడంతో ఇబ్బందులు తీరాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం పాడైన రోడ్లను పట్టించుకోకపోవడంతో అవి మరింత దారుణంగా తయారయ్యాయి. ఏ గ్రామానికి వెళ్లినా మరమ్మతులకు గురైన రోడ్లు మీదుగా ప్రయాణించాల్సిన దుస్థితి. ఇప్పుడు అధికారంలోని వైఎస్సార్ సీపీ అన్ని గ్రామాల రోడ్లు బాగు చేస్తుండడంతో గ్రామస్తులు సంతోషిస్తున్నారు.

–చందక సత్యనారాయణ, సర్పంచ్, పణుకువలస, తెర్లాం మండలం.

ఆనందంగా ఉంది..



గతంలో మా గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడం కష్టతరమైంది. ఇప్పుడు కొత్తగా రోడ్డు వేయడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. ఎంతో ఆనందంగా ఉంది.

–కొరగంజి సాయిరాం, సర్పంచ్, అరసబలగ, తెర్లాం మండలం.

రక్తదానానికి ముందుకు రావాలి


రక్తదానం చేస్తున్న యువకులు

రాజాం సిటీ: ప్రతిఒక్కరూ రక్తదానంపై అపోహలు వీడి, రక్తం దానం చేసేందుకు ముందుకు రావాలని విశ్రాంత ఏడీజీ ఏఎస్ఎన్ మూర్తి కోరారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని మెంటిపేట సుందరం మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరు చేసిన రక్తదానంతో నలుగురి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి, మానవత్వం చాటుకోవాలన్నారు. రక్తం దానం చేయడం ద్వారా ఆరోగ్యమే తప్ప అనారోగ్యముండదన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. మొత్తం 32 యూనిట్ల రక్తం సేకరించినట్లు రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తెలిపారు. కార్యక్రమంలో సుందరం మందిర కన్వీనర్ ముప్పిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

రాజాం: పట్టణంలోని శ్రీనివాస థియేటర్ రోడ్డు, మాధవ బజార్, గాయత్రి కాలనీ, సారధి రోడ్డు, ఇందిరమ్మ కాలనీల్లో ఆదివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాదరావు పారిశుద్ధ్య కార్మికులతో కాలువల్లోని మురుగు తొలగించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని మహిళలకు క్లాప్ మిత్రలకు చెత్త అందించడంపై అవగాహన కల్పించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: ప్రతీఒక్క రైతు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ కోరారు. ఆదివారం మండలంలోని చాటాయవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడమే కాకుండా, అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. రైతులంతా పొలాల్లో నవధాన్యాలు సాగు చేసుకుని, నేల సారవంతం పెంచాలన్నారు. ఆ తర్వాత పంటలు వేసుకుంటే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు, ఎంపీటీసీ పి. అప్పలనాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌరీశ్వరరావు, లక్ష్మంనాయుడు, నారాయణరావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు


ఇన్‌ఫిల్టర్ బావిని పరిశీలిస్తున్న అధికారులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ ఈఈ దక్షిణామూర్తి అన్నారు. దాదాపు 10 రోజుల నుంచి మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉండడంతో రేగిడి మండలంలోని సంకిలి నాగావళి నది వద్ద ఉన్న ఇన్‌ఫిల్టర్ బావిని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 అడుగుల లోతులో ఉన్న ఇన్‌ఫిల్టర్ బావిలో బురద పేరుకుపోవడంతోనే నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని గుర్తించి, తెలిపారు. తొందరలోనే బురదను తొలగించి, నీరు సరఫరా అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఏఈ రత్నాకర్ ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రేగిడి: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలని రేగిడి దత్తపీఠాధిపతి కిమిడి సత్యనారాయణనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక దత్తపీఠంలో ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి దైనందిన జీవితంలో భక్తి భావాలు విస్మరిస్తున్నాడని, దీనివల్ల మానసిక ప్రశాంతత కరువైందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనే మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవి, దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీకళాభారతి ఆడిటోరియంలో జరిగిన శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. గురువులు, తల్లిదండ్రులను గౌరవించాలని, అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. ఒక్క చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించి, ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థుల చదువును ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రోత్సహిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


ఉపాధి వేతనదారులకు నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ పి.రమాదేవి తెలిపారు. ఆదివారం మండలంలోని పొగిరి గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న చోట ప్రీ మాన్‌సూన్ డ్రై షోయింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. నేలలో నవధాన్యాలు జల్లుకోవడం వల్ల భూమి సారవంతం కావడమే కాకుండా పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. 30 రకాల విత్తనాలతో ఎకరానికి 13 కిలోలు జల్లుకోవడం ద్వారా నేలలో సూక్ష్మజీవుల వృద్ధిని ప్రోత్సహించవచ్చన్నారు. దీంతో పంటకు ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి అధికంగా సాధించవచ్చన్నారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాలు వంటి విత్తనాలను ప్రతీ రైతు వేసుకోవాలన్నారు. అనంతరం రసాయనిక వ్యవసాయం మానండి–ప్రకృతి వ్యవసాయం వైపు మరలండి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పి.వెంకటరమణ, పి.భారతి, జి.తిరుపతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


గురువులతో పూర్వ విద్యార్థులు

సంతకవిటి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1983 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. దాదాపు 40 ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి జ్ఞాపకాలను కాసేపు గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్నం విందు ఆరగించి, సాయంత్రం సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఆనంద్‌సాగర్, ఎస్.ఎస్.ఎన్.ఆచార్యులు, రామిరెడ్డిలను సన్మానించి, గురువుల పట్ల తమకున్న గౌరవ, భక్తి భావాలు చాటుకున్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పుస్తకాలు ఏ విధంగా చదవాలి, ఏయే పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానం కలుగుతుందనే విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రతీ విద్యార్థితో పాఠ్య పుస్తకాలు, ఇతిహాసాలు, కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివించడం జరుగుతుందన్నారు. విద్యార్థులంతా లైబ్రరీలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలను అభినందించారు.

సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నేతలు పలువురు ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఓటర్ల ఇంటింటికీ వెళ్లి, మొదటి ప్రాధాన్యతా ఓటు సుధాకర్‌కు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. విశాఖ రాజధాని కావాలన్న ఉత్తరాంధ్రుల బలమైన ఆకాంక్షను ఆయన గెలుపు ద్వారా చాటాలని పిలుపునిస్తున్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో పాల్గొని, ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్


రాజాం: దోలపేటలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు


బొబ్బిలి రూరల్: సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు


రేగిడి: ఉప్పరనాయుడువలసలో ఇంటింటికీ వెళ్లి, ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్‌మోహనరావు


బొబ్బిలి రూరల్: గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ ప్రచారం


బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో వాల్‌పోస్టర్లు అతికిస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు


తెర్లాం: కూనాయవలసలో సుధాకర్‌కు మద్దతుగా బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు ప్రచారం


రామభద్రపురం: కొట్టక్కిలో ఓటర్లకు కరపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సరస్వతి


మెంటాడ: కె.ఎల్.వలసలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం


బాడంగి: దొంకినవలసలో సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు